క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న తులసీవరప్రసాద్

కొత్తూరు: గ్రామాల్లో తిష్టవేసిన సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాద్ కోరారు. కొత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నందున.. ప్రతీ పనిపైన దృష్టిసారించాలని సూచించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ వందరోజుల పాలన పూర్తి చేసేనాటికి హౌసింగ్ లేఅవుట్ల గుర్తింపు, కాలనీ ఇళ్ల మంజూరు ప్రక్రియ కోసం అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు గుర్తించి అంచనాలు సిద్ధం చేయాలన్నారు. నిర్లక్ష్యంగా పనిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్‌ఐ-2గా సింహాచలం



ఆమదాలవలస: ఆమదాలవలస పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ-2గా సింహాచలం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకుళం పట్టణం నుంచి బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సింహాచలం చెప్పారు. ప్రజలు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి జోత్స్న

పొందూరు: భవిష్యత్తును, జీవితాన్ని అంధకారం చేస్తున్న మాదక ద్రవ్యాలు, స్మార్ట్ ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని పొందూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నవారు సైతం మత్తు పదార్థాలకు బానిస అవుతుండడంతో ఆందోళన కలిగిస్తోందన్నారు. ఒకప్పుడు మెట్రోపాలిటన్ నగరాలకు పరిమితమైన ప్రమాదకర మత్తు పదార్థాలతో పాటు గంజాయి ఇప్పుడు పల్లెలకు విస్తరించడంతో చాలామంది వాటికి బానిస అవుతుండడంతో జీవితాలు అంధకారంలోకి జారుతున్నాయన్నారు. విద్యార్థి దశలో ఫోన్లు వినియోగించవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, ప్రిన్సిపాల్ సునీత, ఎస్సై పీపీ రమణ, ఎంపీటీసీ సభ్యుడు హనుమంతురావు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణరాజు

పాతపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో కె.రామకృష్ణరాజు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వీరితో శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ ఏఈ గురునాథం ఉన్నారు.

పంట నమోదు చేపట్టాలి

సారవకోట: రైతులు సాగు చేసుతన్న పంటల వివరాలను నమోదు చేయాలని వ్యవసాయాధికారి కేసీహెచ్ వెంకటరావు సిబ్బందికి సూచించారు. స్థానిక ఏవో కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. వీహెచ్‌ఏలు వారి సచివాలయ పరిధిలో ఉన్న పంట వివరాలు నమోదు చేయాలని.. దీనికి రైతులు వారి ఆధార్ కార్డు, భూమికి సంబంధించిన పత్రాలతో ఆయా సచివాలయ వీహెచ్‌ఏలను సంప్రదించాలన్నారు.

'సూపర్ సిక్స్' అమలెప్పుడు?



మాట్లాడుతున్న సింహాచలం

హిరమండలం: సూపర్ సిక్స్ పేరిట ఎన్నికల ప్పుడు ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు జి.సింహచలం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తప్పనిసరిగా ఇవ్వాల్సిన పింఛన్‌ను మాత్రమే పెంచి ఇస్తోందని, మిగతా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగభృతి, ప్రతిమహిళకు నెలకు రూ.1500, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి హామీలను ఎప్పుడు అమల చేస్తారన్నారు. ఎన్నికల హామీ నెరవేర్చకపోతే ప్రజలు తిరగబడటం ఖాయమని హెచ్చరించారు.

● అవగాహన



యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలగాలని ఆమదాలవలస జూనియర్ సివిల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి సూచించారు. ఆమదాలవలస మండలంలోని దన్నానపేట సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగం, వాటి దుష్ప్రభావాలు, ర్యాగింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆమదాలవలస బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మిబాయి, సీనియర్ న్యాయవాదులు పి.వి.నరసింహులు, తమ్మినేని అన్నంనాయుడు, బొడ్డేపల్లి మోహన్‌రావు, కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

-ఆమదాలవలస

● వైద్య శిబిరం



పాతపట్నం మండలం బొమ్మిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. గంగువాడ పీహెచ్‌సీ వైద్యుడు శివ కుమార్ రోగులకు వైద్య సేవలందించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాతపట్నం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి రోషిణి మాట్లాడుతూ.. పేద ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఇ.సత్యనారాయణ, న్యాయవాదులు దండాసీ, రమణ, చంద్రభూషణ, రామకృష్ణ, హెచ్‌ఎం కె.త్రినాథరావు, బొమ్మిక, బడ్డుమర్రి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

-పాతపట్నం

● పరిశుభ్రత



బూర్జ మండలంలోని తమ్మినాయుడుపేట గ్రామంలో స్థానిక సర్పంచ్ మూడడ్ల సుదీప్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను శనివారం చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించారు. రోడ్లను శుభ్రం చేయించారు. మంచినీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టారు. గ్రామ నాయకుడు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్నందున వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా క్లోరినేషన్ చేయించడం జరిగిందన్నారు. ప్రజలు కూడా పారిశుద్ధ్యం క్షీణించకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రుద్రవేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ:

బియ్యంతో సరి..!

- రేషన్‌లో కందిపప్పు, పంచదారకు కోత
- ఆహార భద్రతకు తూట్లు పొడుస్తున్న కూటమి సర్కార్



ఎండీయూ వాహనం ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

హిరమండలం: పేదల ఇంట పప్పులుడకడం లేదు. కూటమి ప్రభుత్వం చెప్పే మాటలు కోటలు దాటుతుంటే ..చేతలు మాత్రం కోతలు పెడుతున్నాయి. చౌకదుకాణాలు, ఎండీయూ వాహనాల ద్వారా పేదలకు సరఫరా చేసే నిత్యావసర సరుకుల్లో కోత పెడుతోంది. కందిపప్పు, పంచదారకు ప్రభుత్వం మంగళం పాడేసింది. ప్రజాపంపిణీ వ్యవస్థ అంటే దారిద్ర్య రేఖకు దిగువున్న వారికి తక్కువ ధరకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయడమే. కానీ కూటమి ప్రభుత్వం ఈభారాన్ని కూడా తగ్గించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. గడిచిన రెండు నెలలుగా జూన్, జూలై మాసాల్లో కందిపప్పు, పంచదార సరఫరా నిలిపివేసింది. తాజాగా ఆగస్టు నెల అయినా తమ ఇంట పప్పులుడుకుతాయని, నోరుతీపి అవుతుందని భావించిన పేదలకు ఈనెలా భంగపాటు తప్పలేదు. ఎన్నికలకు ముందు వరకు ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం, కందిపప్పు, పంచదారలను పేదలకు పంపిణీ చేసేవారు. కానీ గడిచిన రెండు నెలలుగా బియ్యం పంపిణీతో సరిపెడుతున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో 219 రేషన్ దుకాణాల ద్వారా 8,2810 రేషన్ కార్డుదారులకు ఇంటింటికీ రేషన్ బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు.

కందిపప్పు, పంచదారలకు మంగళం

నియోజకవర్గంలో రేషన్ కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేయాలంటే నెలకు సుమారు 42 టన్నులు, పంచదార 82 టన్నులు అవసరం. ఒక్కో కార్డుదారునికి అర కిలో పంచదార రూ.17, కిలో కంది పప్పు రూ.67లకు అందిస్తారు. కానీ ప్రభుత్వం ఈ రెండు సరుకులనూ రెండు నెలలుగా సరఫరా చేయకపోవడంతో కార్డుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నియోజకవర్గంలో రేషన్ దుకాణాలు, ఎండీయూ వాహనాలు, కార్డుదారుల వివరాలు

మండలం	ఎఫ్‌పీఎస్	రేషన్‌కార్డులు	ఎండీయూ
పాతపట్నం	47	20,299	14
హిరమండలం	31	12,241	9
కొత్తూరు	61	22,634	17
మెళియపుట్టి	44	16,675	12
ఎల్ఎన్‌పేట	36	10,961	7

బియ్యం మాత్రమే ఇస్తున్నారు



రెండు నెలలుగా రేషన్‌షాపు ద్వారా బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. కందిపప్పు, పంచదార ఇవ్వడంలేదు. మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.180, పంచదార 50 రూపాయలుగా ఉంది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా పంచదార, కంది పప్పు పంపిణీ చేసేవారు. అప్పటిలాగే కూటమి ప్రభుత్వం నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి.

-కె.మాలతి, పాత హిరమండలం

రెండునెలలుగా సరఫరా చేయలేదు



రెండు నెలలుగా పంచదార, కందిపప్పు సరఫరా చేయలేదు. ఈనెల కూడా స్టాక్ రాలేదు. బియ్యం వరకే స్టాక్ వచ్చాయి. వాటివరకు రేషన్ దుకాణాలు, ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేయిస్తున్నాం

– బి.వెంకటరమణ, తహసీల్దార్ హిరమండలం

ఉపాధి సిబ్బంది పనితీరు మార్చుకోవాలి

- ప్రజావేదికలో ప్రజాప్రతినిధులు



సమస్యలను పీడీ చిట్టిరాజు దృష్టికి తెస్తున్న ప్రజలు

సరుబుజ్జిలి: ఉపాధిహామీ పథకం సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని పలువురు ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు ఆధ్వర్యంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక సభను మండల కేంద్రమైన సరుబుజ్జిలిలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా సోషల్ ఆడిట్ డీఆర్‌పీలు పంచాయతీల వారీగా పలు ఆరోపణలపై గుర్తించిన అంశాలను వరుస క్రమంలో చదివి వినిపించారు. పలు గ్రామాల్లో మస్టర్ల దిద్దుబాట్లు, అధికంగా వేతనం నమోదు వంటి అంశాలు గుర్తించామని వెల్లడించారు. ఉపాధి యంత్రాంగం శతశాతం లక్ష్యాలను చేరుకోవాలనే ఉద్దేశంతో కొన్నిచోట్ల మస్టర్ల నమోదు విషయంలో పక్కదారి పట్టిస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆరోపించారు. కొంత మంది సాంకేతిక సహాయకులు పనిచేసే ప్రదేశాలకు వెళ్లకుండా, పర్యవేక్షణ చేయకుండా మేట్లు ఇచ్చిన మస్టర్లనే ప్రామాణికంగా తీసుకుంటున్నారని సభలో ఫిర్యాదు చేశారు. పనుల్లో నాణ్యత కోసం ఏర్పాటు చేసిన క్వాలిటీ కంట్రోల్ విభాగం వలన ఎటువంటి ఉపయోగం లేదని, పనులు చేసి నీటిలో మునిగిపోయిన తరువాత క్వాలిటీ విభాగం తనిఖీలు చేస్తే ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న పలువురు ఉద్యోగులు కార్యాలయాల్లో కూర్చొని పనులు చక్కబెడుతున్నారే తప్పా క్షేత్రస్థాయిలో పర్యటించడంలేదని పీడీకి ఫిర్యాదు చేశారు. బప్పడాం, గోనెపాడు, విజయరాంపురం, పాలవలస, చినకాగితాపల్లి, కొత్తకోట గ్రామాల్లో ఫీల్డ్‌అసిస్టెంట్ల విషయంలోఆడిట్ సమయంలో పలు ఆరోపణలు వచ్చాయని డీఆర్‌పీలు సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కె.వి.జి.సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు, క్వాలిటీ కంట్రోల్ సతీష్, ఏపీడీ పంచాది రాధ, జేఈసీవో గోవిందు, మన్మథ, ఏపీఓ పార్వతి, ఈసీ రమాదేవి ఉన్నారు.

సంక్షేమ పథకాల పంపిణీలో వివక్షత ఎందుకు?

- మండల సమావేశంలో ఆమదాలవలస ఎంపీపీ శారదమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శారదమ్మ

ఆమదాలవలస: రైతులకు, ప్రజలకు ప్రభుత్వ పథకాలు పంపిణీ చేయడంలో వివక్షత ఎందుకు చూపిస్తున్నారని ఆమదాలవలస ఎంపీపీ తమ్మినేని శారదమ్మ అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు ఆధ్వర్యంలో మండల సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. శ్రీనివాసాచార్యులపేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి మాట్లాడుతూ.. రైతులకు రెండో విడత యూరియాను ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారని ఏవో మెట్ట మోహనరావును ప్రశ్నించారు. యూరియా పంట చేలకు వేసిన 25 రోజుల తర్వాత రెండో విడత వేయాలని ఆ సమయానికి ముందే రైతులకు యూరియాను సరఫరా చేస్తామని వ్యవసాయ అధికారి బుదులిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ శారదమ్మ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల వివక్షత చూపించకుండా ప్రజలకు అందుబాటులో అధికారులు పనిచేయాలన్నారు. గాజుల కొల్లివలస ప్రజాప్రతినిధి మాట్లాడుతూ.. డీఏపీ ఎరువును ఇంతవరకు రైతులకు ఇవ్వలేదని, ఎప్పడు ఇస్తారని వ్యవసాయశాఖ అధికారిని ప్రశ్నించారు. మూడు, నాలుగు రోజుల్లో పంపిణీకి సిద్ధం చేస్తామని ఏవో చెప్పారు. ఈ సందర్భంగా విద్యుత్, ఉపాధి హామీ, పౌరసరఫరాలు, ఆరోగ్యశాఖ అధికారులు సంబంధిత అంశాలను సభలో చదివి వినిపించారు. సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

ఆమదాలవలస: ఆమదాలవలస పోలీస్ స్టేషన్‌ను శనివారం సాయంత్రం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌లోని రిసెప్షన్ కేంద్రంతోపాటు పరిసరాలను, ముఖ్యమైన డ్యూటీ రిజిస్టర్ నిర్వహణ క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. సిబ్బందికి కేటాయించిన విధులు, వారి పనితీరుపై ఆరా తీశారు. రాత్రి వేళలో ముమ్మరంగా పెట్రోలింగ్ చేయడంతో పాటు గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

రోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అక్రమ రవాణా అరికట్టాలని, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరు క్రమ శిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. ఆమదాలవలస ఎస్ఐ వెంకటేశ్వరరావు, సీఐ దివాకర్ యాదవ్‌లు సెలవులో ఉండడంతో ఎస్ఐ-2 సింహాచలం, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

విద్యా సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ పద్మావతికి వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

ఎల్.ఎన్.పేట: విద్యారంగంలో నెలకున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.శ్రీరామచంద్రమూర్తి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.జయరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ వై.వి. పద్మావతి, ఎంఈవో చంద్రమౌళిలకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను శనివారం అందజేశారు. జీవో 117 రద్దు చేసి జీవో ఎంఎస్ నంబర్ 50, 12.10.2020 ప్రకారం టీచర్లను కేటాయించాలని, ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలలో కొనసాగించాలని, గిరిజన గ్రామాల్లో రెండో తరగతి వరకు పాఠశాలలు నిర్వహించాలని, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించాలని కోరారు. ముఖ్యంగా ఉపాధ్యాయలను బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ మండలశాఖ గౌరవ అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, అధ్యక్షులు చిన్నారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.ఢిల్లేశ్వరావు, ఉపాధ్యాయలు ఎం.ప్రసాదరావు, పైడి రాజు, రామారావు, రమేష్, జనార్దన, సింహచలం, రవీంద్ర ఉన్నారు.

ఇసుకపై నిరంతర నిఘా



మడపాం వద్ద ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట: మండలంలో వంశధార నదికి ఆనుకొని ఉన్న గ్రామాల్లో ఇసుక తవ్వకాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ సత్యన్నారాయణ అన్నారు. ఈ మేరకు గ్రామాల వారీగా కమిటీలు నియమించామని చెప్పారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని గోపాలపెంట, మడపాం, బుచ్చిపేట, చేనులవలస, లుకలాం వద్ద వంశధార నదికి ఆనుకొని ఉన్న ఇసుక ర్యాంపులను ఏఎస్ఐ అశిరినాయుడు, సర్వేయర్ అప్పలస్వామిలతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా ఏ ర్యాంపులో కూడా తవ్వకాలు చేయకూడదన్నారు. బుచ్చిపేట, లుకలాంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు తెలిసిందని.. ఈ గ్రామాల వద్ద మరింత నిఘా పెడుతున్నామన్నారు. అలాగే గ్రామాల్లో ట్రాక్టర్లు యజమానుల ఫోను నంబర్లు సేకరిస్తున్నామని వారితో సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు చేయనున్నామన్నారు. నిబంధనలు అతిక్రమించి ఇసుక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా తహసీల్దార్ వెంట ఆర్ఐ లోకేష్‌తో పాటు వీఆర్వోలు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

ఆమదాలవలస: చేపేనపేట, నిమ్మతొర్లువాడ గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న వరి క్షేత్రాలను జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రేవతి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. వరి సాగులో వినూత్న పద్ధతిలో శ్రీవరి సాగు, లైన్ షోయింగ్ పద్ధతిలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నట్టు పేర్కొన్నారు. నాట్లు వేసినప్పటి నుంచి విధిగా పాటించాల్సిన సూత్రాలను రైతులకు వివరించారు.

ప్రతినెల మొదటి బుధవారం 'ప్రజాదర్బార్'

ఎల్.ఎన్.పేట: ఇకపై ప్రతినెల మొదటి బుధవారం పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల ఏడో తేదీ మొదటి బుధవారం కావటంతో ఆ రోజు ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు మెళియాపుట్టి మండల ప్రజల కోసం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆదే రోజు ఉదయం 10.15 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు కొత్తూరు, 12.30 నుంచి 2.30 గంటల వరకు ఎల్.ఎన్.పేట, 2.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు హిరమండలం, ఐదు నుంచి రాత్రి ఏడు గంటల వరకు పాతపట్నం మండలాల ప్రజల కోసం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేటాయించిన సమయాల్లో మాత్రమే ఆయా మండలాలకు చెందిన ప్రజలు వారి సమస్యలపై ఫిర్యాదు చేయాలని సూచించారు.

వరినాట్లు వరుస క్రమంలో వేయాలి

సరుబుజ్జిలి: వరినాట్లు వరుస క్రమంలో వేయాలని మండల వ్యవసాయాధికారి బొడ్డేపల్లి పద్మనాభం అన్నారు. ఇలా నాటడం వలన పంటకు చీడపీడలు ఆశించవని, అధికదిగుబడి వస్తోందన్నారు. రావివలస గ్రామంలో వరినాట్లు విధానంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వండాన కృష్ణ, వెలుగు ఏపీఎం కమల కుమారి పాండ్యన్, అగ్రికల్చర్ అసిస్టెంట్ జగదీశ్వరరావు, యూనిట్ ఇన్‌చార్జి మన్మథరావు, ఐసీఆర్‌పీ తిరుపతిరావు, సుమ రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఈక్రాప్ నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఏడీఏ రాజగోపాల్

హిరమండలం: పంటనమోదు (ఈక్రాప్) ప్రక్రియ కొనసాగించాలని కొత్తూరు వ్యవసాయ శాఖ ఏడీఏ బి.రాజగోపాలరావు అన్నారు. హిరమండలం రైతు సేవాకేంద్రం-3 లో డివిజన్ స్థాయి వ్యవసాయశాఖ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్‌కు సంబంధించి ఈక్రాప్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఆర్ఎస్‌కేల వారీగా ప్రణాళికల ప్రకారం ఈక్రాప్ కొనసాగించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఈపంట నమోదు అప్లికేషన్‌లో సర్వే నంబర్ల వారీగా జియో కోఆర్డినేటర్‌తో ఫొటోలు తీయాలని సూచించారు. రైతుందరూ తప్పనిసరిగా సాగుచేసిన ప్రతి పంటనూ ఈక్రాప్ చేసుకునేలా క్షేత్రస్థాయి అధికారులకు సహకరించాలని కోరారు. సెప్టెంబర్ 15వ తేదీ లోగా ఈక్రాప్ ప్రక్రియ పూర్తి చేయాలని కమిషనరేట్ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో కొత్తూరు, హిరమండలం, సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట వ్యవసాయ అధికారులు స్వర్ణలత, బి.సంధ్య, బి.పద్మనాభం, పి.లతశ్రీ, సచివాలయ వీఏఏలు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయకపోతే చర్యలు

ఎల్.ఎన్.పేట: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రజలకు జవాబుదారీగా బాధ్యతగా పని చేయకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ వైవీ పద్మావతి హెచ్చరించారు. పెద్దకొల్లివలస అంగన్‌వాడీ కేంద్రం, యూపీ పాఠశాల, గ్రామ సచివాలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. అంగన్‌వాడీ, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఆమెతో పాటు ఆర్ఐ గవరయ్య ఉన్నారు.

వీఆర్ఏలకు నైట్ డ్యూటీలు వేయరాదు

పొందూరు: తహసీల్దార్ కార్యాలయాల్లో వీఆర్ఏలకు నైట్ డ్యూటీలు వేయరాదని.. దీనిని విరమించుకోవాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు తెండేల త్రినాథరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వీఆర్ఏల సంఘం పిలుపు మేరకు పొందూరు తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీనివాసరావుకు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ.. వీఆర్ఏలకు సర్వీస్ రూల్స్‌లో లేని జీవో ఇచ్చి ఇలా రాత్రి వేళల్లో డ్యూటీలు వేయడం సరికాదని అన్నారు. పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలో పూడికతీత

కొత్తూరు: కొత్తూరులోని వెలగ చెరువు సాగునీటి కాలువలో పూడికతీత పనులను శనివారం చేపట్టారు. స్థానిక సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లక్ష్మణరావుల పనులను పర్యవేక్షించారు. కాలువలో పూడిక పేరుకుపోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు వరి నాట్లు వేయలేకపోయారు. రైతులు ఈ సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించారు. జేసీబీని ఏర్పాటుచేసి కాలువలో పూడికను తొలగించారు.

ఎమ్మెల్యేను కలిసిన ఉపాధి సిబ్బంది



ఎమ్మెల్యే గోవిందరావును సత్కరిస్తున్న ఉపాధిసిబ్బంది

మెళియాపుట్టి: పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును ఉపాధి హామీ పథకం సిబ్బంది మండల కేంద్రంలో ఓ కల్యాణ మండపంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ని దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి ఎమ్మెల్యేను కోరారు. ఎంపీడీవో భాస్కరరావు, ఏపీవో రవి, ఈసీ ఆదినారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ సలాన మోహనరావు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆమదాలవలస: వరినాట్లు వేసేముందు చిగుళ్లను తుంచి నాటుకోవాలని మండల వ్యవసాయ అధికారి మోహనరావు రైతులకు సూచించారు. కొరపాం గ్రామంలో నాట్లు వేసే విధానంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. చిగుళ్ల తుంచి నాటుకోవడం వలన చీడ పీడల నుంచి నివారించుకోవచ్చునని తెలిపారు. రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని అన్నారు. వ్యవసాయ సహాయకులు రాజశేఖర్ ఉన్నారు.